

ఎంఎస్ అనుచరుల దౌర్జన్యం

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని అధికారులకు విన్నవించేందుకు వచ్చిన నాయకులపై మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అనుచరులు దౌర్జన్యానికి దిగారు. 8లో



టమాట కిలో రూ.46

అనంతపురం కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.46 పలికింది. కనిష్టం రూ.30, సరాసరి రూ.38 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
33.7°/ 23.6°

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

అన్నీ మాకే..!

రాష్ట్రంలో కొత్త ఎక్సైజ్ పాలసీ నేపథ్యంలో మద్యం షాపులు ప్రైవేట్ వారికి అప్పగిస్తున్నారు. షాపులు దక్కించుకునేందుకు అనంతపురంలో అధికార తెలుగుదేశం పార్టీకి చెందిన లిక్కర్ మాఫియా రంగంలోకి దిగింది. 'షాపులన్నీ మా పార్టీ వారికే. బయటి వ్యక్తులు ఎవరైనా పోటీకి వచ్చి దరఖాస్తు వేసినా.. వేయించినా ఇబ్బందులు తప్పవు. కాదని ఎవరైనా దరఖాస్తు చేస్తే మీ అంతు చూస్తాం. నగరంలో ఆదాయం బాగుంటుందని ఆశపడి మద్యం షాపులకు ప్రయత్నిస్తే ఆర్థికంగా కోలుకోలేకుండా పోతారు' అని హెచ్చరించింది.



- బయటివారికి నో చాన్స్
- కాదని వస్తే అంతు చూస్తాం
- బార్ల యజమానులకు టీడీపీ నేతల హెచ్చరిక
- మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోరాదని హుకుం
- ఏకంగా ప్రభుత్వ అతిథి గృహంలోనే లిక్కర్ సిండికేట్ సమావేశం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: జిల్లా కేంద్రంలో మద్యం మాఫియా చెలరేగిపోతోంది. టీడీపీలో లిక్కర్ డాన్‌గా పేరున్న సుధాకర్‌నాయుడు ఆధ్వర్యంలో అనంతపురం అర్బన్ నియోజకవర్గ పరిధిలోని బార్ల యజమానులతో గురువారం రాత్రి సమావేశమయ్యారు. ప్రైవేటు మద్యం షాపుల విషయంలో మీరు జోక్యం చేసుకోకూడదని, మీరు దరఖాస్తులు వేసినా షాపులొస్తే మాత్రం నడుపుకోలేరని, ఇబ్బందులు తప్పవని బెదిరించినట్లు బార్ అండ్ రెస్టారెంట్ యజమానులు చెప్పారు. 'మీరు వెయ్యకపోతే మిగతా వారిని మేము 'మేనేజ్' చేసుకుంటాం, ఎమ్మెల్యే కోటా కింద మాకు టౌన్‌లో వదిలెయ్యండి, మిగతా చోట్ల కావాలంటే మీరు వేసుకోండి' అంటూ హుకుం జారీ చేసినట్లు తెలిసింది.

ప్రభుత్వ అతిథి గృహంలోనే సమావేశం

సాధారణంగా రోడ్లు, భవనాల అతిథి గృహాన్ని గవర్నర్, మంత్రులు, లేదా ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు మాత్రమే ఇస్తుంటారు. అలాంటిది ఈ ప్రభుత్వ అతిథి గృహం గురువారం రాత్రి పొద్దు పోయేదాకా లిక్కర్ సిండికేట్ సమావేశానికి వేదికైంది అంటే పరిస్థితి అంచనా వేయొచ్చు. ఈ సమావేశానికి ఆర్అండ్‌బీ అధికారులు ఎలా ఇచ్చారు.. కలెక్టర్ దీనికి ఎలా ఆమోదం తెలిపారు.. అన్నది అర్థం కావడం కాలేదు. నాలుగు గంటల పాటు జిల్లాలో లిక్కర్ మాఫియా అంతా ఇక్కడే మకాం వేసి సిండికేట్ సమావేశం నడిపారు. తాడిపత్రిలో కూడా పరిస్థితి ఇలాగే ఉందని సమాచారం. దరఖాస్తు వేసే వారిని బెదిరించాలని చూస్తున్నట్లు తెలిసింది.



మద్యం సిండికేట్ మాఫియా సమావేశం నిర్వహించిన ఆర్అండ్‌బీ అతిథి గృహం

సిండికేట్ అయితే భారీ నష్టం

సిండికేట్ అయితే ప్రభుత్వానికి రూ.కోట్లలో నష్టం వాటిల్లనుంది. జిల్లాలో 136 మద్యం షాపులకు దరఖాస్తులు ఆహ్వానించారు. దీనికి సుమారు 1,500 వరకూ దరఖాస్తులు వస్తాయని అంచనా వేశారు. అంటే ఒక్కో దరఖాస్తుకు రూ.2 లక్షల చొప్పున 1,500 దరఖాస్తులకు రూ.30 కోట్లు దరఖాస్తు ఫీజు రూపంలోనే వస్తుంది. కానీ టీడీపీ లిక్కర్ మాఫియా సిండికేట్ అయితే 800 దరఖాస్తులు కూడా వచ్చే పరిస్థితి ఉండదు. ఆదాయం సగానికి పైగా పడిపోతుంది. ఇప్పటికే కొన్ని నియోజకవర్గాల్లో టీడీపీ నేతలు దరఖాస్తులు వేసేందుకు ఆసక్తి ఉన్నవారిని బెదిరింపులకు గురిచేస్తున్నారు.

జిల్లాలో కొత్తగా వచ్చే మద్యం షాపులు ఇలా..

మొత్తం మద్యం దుకాణాలు	136
ఇందులో సాధారణ దుకాణాలు	127
గీత కార్మికులకు	09
దరఖాస్తుల అంచనా	1,500
దరఖాస్తుల రూపేణా ఆదాయం	రూ.30 కోట్లు

న్యూస్‌రీల్

పర్యాటక అభివృద్ధికి చర్యలు



పర్యాటక ప్రదేశాల పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్, ఎంపీ, జెడ్పీ చైర్‌పర్సన్

అనంతపురం రూరల్: పర్యాటక రంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోందని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా గురువారం శిల్పారామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీతో పాటు కలెక్టర్ వినోద్‌కుమార్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హాజరయ్యారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరికుమార్ పాల్గొన్నారు.

బాబు పాపాల ప్రక్షాళనకు నేడు ఆలయాల్లో పూజలు

అనంతపురం కార్పొరేషన్: తిరుమల పవిత్రత, లడ్డూ విశిష్టత, వేంకటేశ్వరస్వామి వైభవాన్ని అపవిత్రం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి పాపాలను ప్రక్షాళన చేసేందుకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శనివారం జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతపురంలోని రైల్వేఫీడర్ రోడు వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం పది గంటలకు పూజ నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు.

రక్షణ చట్టాలపై అవగాహన తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న సీఐ సాయిప్రసాద్

అనంతపురం సెంట్రల్: మహిళలు, చిన్నారుల రక్షణ కోసం అమలు చేస్తున్న చట్టాలపై తప్పనిసరిగా అవగాహన ఉండాలని ఎస్పీ జగదీష్ పిలుపునిచ్చారు. ఎస్పీ ఆదేశాలతో శుక్రవారం జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో పోక్సోయాక్టు, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థినుల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే నిర్భయంగా తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. మన శరీరాన్ని తాకే విధానం బట్టి గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ అనే విషయాన్ని తెలుసుకోవాలని తెలిపారు. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే ఎవరికి వారు రక్షించుకునే విధంగా తయారుకావాలని, ఏ సహాయం కావాలన్నా పోలీసు శాఖ తోడుగా ఉంటుందని, ఏ క్షణమైనా డయల్ 100, 112కు ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు.

పీఆర్ ఎస్ఈ జహీర్ బాధ్యతల స్వీకరణ



మహమ్మద్ జహీర్ అస్లాం

అనంతపురం సిటీ: పంచాయతీరాజ్ (పీఆర్) సూపరింటెండెంట్‌గా నియమితులైన మహమ్మద్ జహీర్ అస్లాం శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇన్‌చార్జ్ ఎస్ఈ కేవీకేవీ ప్రసాద్ నుంచి ఆయన చార్జ్ తీసుకున్నారు. జహీర్ ఇదివరకు అనంతపురం జేఎన్‌టీయూలో పనిచేశారు. గతంలో రాయదుర్గం డీఈఈగా, అనంతపురం ఈఈగా కూడా విధులు నిర్వర్తించారు. జిల్లాపై మంచి అవగాహన, పట్టు కలిగి ఉన్నారు. ఇప్పటి వరకు కొనసాగిన ఇన్‌చార్జ్ ఎస్ఈ పీఐయూ ఈఈగా కొనసాగుతారు. ఉద్యోగులు, సిబ్బంది కొత్త ఎస్ఈని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి, శుభాకాంక్షలు తెలిపారు.

రిమాండ్‌లో 'చీటి'ంగ్ టీచరు

- చీటీల పేరుతో రూ. కోట్లకు కుచ్చుటోపీ పెట్టిన దివాకర్ నాయుడు
- ఇటీవల కోర్టులో లొంగుబాటు... రిమాండ్‌కు ఆదేశించిన జడ్జి
- నేడో, రేపో సస్పెన్షన్ వేటు వేయనున్న విద్యాశాఖ అధికారులు

అనంతపురం ఎడ్యుకేషన్: చీటీల (చిట్స్) పేరుతో మోసం చేసిన ప్రభుత్వ టీచర్ కటకటాల పాలయ్యారు. ముందస్తు బెయిల్ కోసం చేసిన ప్రయత్నాలు బెడిసి కొట్టడంతో రిమాండ్‌లో ఊచలు లెక్కిస్తున్నాడు. వివరాల్లోకి వెళ్తే... అనంతపురంలోని రాజేంద్ర నగరపాలక ఉన్నత పాఠశాలలో తెలుగు టీచరుగా పని చేస్తున్న కాకర్ల దివాకర్‌నాయుడు నమ్మకంగా ఉంటూ పలువురి వద్ద చీటీలు వేయించుకున్నాడు. చీటీలు పూర్తయినా డబ్బు చెల్లించకుండా, ఆ మొత్తంపై వడ్డీ ఇస్తానంటూ నమ్మబలికాడు. ఆ వడ్డీ కూడా వారి చేతికి ఇవ్వకుండా కొత్త చీటీలకు జమ చేసుకుంటూ వచ్చాడు. ఈ చీటీలూ పూర్తవడంతో ఆయనపై ఒత్తిళ్లు పెరిగాయి. మరి కొందరి వద్ద నెల వడ్డీకి రూ.లక్షలు తీసుకున్నాడు. వీరికి కొంత కాలం వడ్డీ చెల్లించి తర్వాత మొహం చాటేశాడు. అప్పులు రూ.కోట్లకు చేరుకున్నాయి. బాధితుల నుంచి ఒత్తిళ్లు పెరిగిపోవడంతో మూణ్నెళ్ల కిందట కుటుంబంతో ఉడాయించాడు. దివాకర్‌నాయుడు కుచ్చుటోపీ పెట్టిన నిర్వాకంపై 'సాక్షి' జూలై 10, 12 తేదీల్లో వరుస కథనాలు ప్రచురించి వెలుగులోకి తెచ్చింది. దీంతో అప్రమత్తమైన బాధితులు కలెక్టర్, ఎస్పీని కలిసి ఫిర్యాదులు చేశారు. వారి ఆదేశాలతో రంగంలోకి దిగిన విద్యాశాఖ అధికారులు పాఠశాలకు వెళ్లి విచారణ చేశారు. పలువురు బాధితులతోనూ మాట్లాడారు. ఆ మేరకు ఎస్పీకి నివేదిక ఇచ్చారు. బాధితుల ఫిర్యాదు మేరకు అనంతపురం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది.



కాకర్ల దివాకర్‌నాయుడు

ముందస్తు బెయిల్‌కు ప్రయత్నం

తనపై కేసు నమోదు కావడంతో జిల్లా కోర్టుతో పాటు హైకోర్టులోనూ దివాకర్‌నాయుడు ముందస్తు బెయిల్‌కు ప్రయత్నాలు చేశాడు. అనుకూలం కాకపోవడంతో ఇటీవల జిల్లా కోర్టులో లొంగిపోయాడు. జడ్జి ఆదేశాల మేరకు పోలీసులు బాధితుడిని రిమాండ్‌కు తరలించారు. తర్వాత విచారణ కోసం రెండురోజుల పాటు పోలీసులు కస్టడీకి అనుమతులు తీసుకున్నారు. ఈ క్రమంలో దివాకర్‌నాయుడు ఇంటికి వెళ్లిన పోలీసులు పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

నేడో, రేపో సస్పెన్షన్ వేటు

దివాకర్‌నాయుడు రిమాండ్ రిపోర్ట్ పోలీసుల నుంచి విద్యాశాఖకు వచ్చింది. దీని ఆధారంగా ఆయనను సస్పెండ్ చేసేందుకు ఫైలు సిద్ధమైంది. నేడో, రేపో సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేయనున్నారు. కాగా... దివాకర్‌నాయుడు నిర్వాకం కొందరు తోటి టీచర్లకు చాలా రోజుల కిందే తెలిసినా బయట పడకుండా జాగ్రత్త పడ్డారు. చీటీల వ్యవహారంలో వారి ప్రమేయంపైనా అనుమానాలు కలుగుతున్నాయి. పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో కొందరిని ఇప్పటికే పోలీసులు ప్రశ్నించినట్లు తెలిసింది.

డిప్యూటీ కలెక్టర్లకు పోస్టింగ్

అనంతపురం అర్బన్: బదిలీ అయిన డిప్యూటీ కలెక్టర్లకు పోస్టింగ్ కల్పిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం ఆర్‌డీఓగా జి.కేశవనాయుడు నియమితులయ్యారు. ప్రస్తుతం ఈయన పిఠాపురం కేఆర్‌సీసీ ఎస్‌డీసీగా ఉన్నారు. కళ్యాణదుర్గం ఆర్‌డీఓగా వసంతబాబును నియమించారు. ప్రస్తుతం ఈయన అనంతపురం హెచ్ఎల్‌సీ ఎస్‌డీసీగా, అనంతపురం ఇన్‌చార్జ్ ఆర్‌డీఓగా ఉన్నారు. కళ్యాణదుర్గం ఆర్‌డీఓగా ఉన్న రాణి సుస్మితను కొవ్వూరు ఆర్‌డీఓగా బదిలీ చేశారు. పోస్టింగ్ కోసం ఎదురుచుస్తున్న ఏబీవీఎస్‌బీ శ్రీనివాస్‌ను గుంతకల్లు ఆర్‌డీఓగా నియమించారు.

సుముఖంగా లేని కేశవనాయుడు

అనంతపురం ఆర్‌డీఓగా నియమితులైన జి.కేశవనాయుడు ఇక్కడికి వచ్చేందుకు సుముఖంగా లేరని తెలిసింది. ఈ విషయాన్ని ఆయన తనకు దగ్గరగా ఉన్న వారితో చెప్పినట్లు సమాచారం. వేరే చోట పోస్టింగ్ కోసం ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది.

'ఎన్ఎంఎంఎస్' దరఖాస్తు గడువు పొడిగింపు

అనంతపురం ఎడ్యుకేషన్: ఈ ఏడాది డిసెంబరు 8న జరగనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు మరోమారు గడువు పెంచారు. అక్టోబర్ మూడో తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని మోడల్ స్కూళ్లలో ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ వరలక్ష్మి, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ సూచించారు. www.bre.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రింటెడ్ నామినల్ రోల్, ఒరిజినల్ ఎస్‌బీఐ కలెక్ట్ రసీదును డీఈఓ కార్యాలయంలో అక్టోబరు 14లోగా అందజేయాలని హెచ్ఎంలు, ప్రిన్సిపాళ్లకు సూచించారు. కుటుంబ సంవత్సరాదాయం రూ.3,50,000 లోపు ఉన్న విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ పరీక్ష రాసేందుకు అర్హులని పేర్కొన్నారు. ఆన్‌లైన్ నమోదు సమయంలో విద్యార్థి ఆధార్‌లో ఉన్న విధంగానే పేరు నమోదు చేయాలని, దరఖాస్తు సమయంలో ఎలాంటి ధ్రువపత్రాలు అవసరం లేదని స్పష్టం చేశారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

తనిఖీ పేరిట తిట్ల దండకం

- 'గురుకుల' సిబ్బందిపై శివాలెత్తిన ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

బుక్కరాయసముద్రం: గురుకుల పాఠశాల తనిఖీకి వెళ్లిన శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సిబ్బంది పట్ల వ్యవహరించిన తీరు విమర్శలకు తావిచ్చింది. బోధన.. పాఠశాల నిర్వహణలో ఏవైనా లోటుపాట్లు ఉంటే గుర్తించి సరిచేసుకోవాలని సూచించాల్సిన ఆమె.. అందుకు భిన్నంగా ప్రవర్తించారు. గంటల తరబడి సిబ్బందిని దూషిస్తూ మానసిక క్షోభకు గురి చేశారు. ఈ క్రమంలో ఒకరు సకాలంలో భోజనం చేయని కారణంగా లో బీపీతో సొమ్మసిల్లి పడిపోయారు. వివరాల్లోకెళితే... ఎమ్మెల్యే శ్రావణిశ్రీ శుక్రవారం మధ్యాహ్నం 12.15 గంటలకు కొర్రపాడు వద్ద ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. మైదానంలో గడ్డి, పిచ్చి మొక్కలు కనిపించడంతో సిబ్బందికి చీవాట్లు పెట్టారు. మనుషులను పెట్టి శుభ్రం చేయించినా ఇటీవల కురిసిన వర్షాలకు మళ్లీ గడ్డి పెరిగిందని సిబ్బంది సమాధానమిచ్చారు. బడ్జెట్ లేక కొన్ని పనులు చేయలేకపోతున్నామని చెప్పారు. అయితే వారి మాటను పట్టించుకోకుండా ఎమ్మెల్యే దూషించారు. తర్వాత క్లాస్ రూమ్‌లు, వంట గది, వసతి భవనాలను పరిశీలించారు. పాఠశాల సిబ్బందిలో సగం మంది 45 నుంచి 55 ఏళ్ల వయసు లోపు వారున్నారు. భోజనం తినే సమయం ఇవ్వకుండా 4.45 గంటల వరకు చిన్న చిన్న కారణాలు చూపుతూ దూషించారు. ఏ సమయంలో ఎవరిని తప్పు పడతారో.. ఏం తిడతారోనని సిబ్బంది హడలెత్తిపోయారు. ఇక ఏఎన్ఎం మాధవీలతను పిలిచి.. విద్యార్థులకు మందులు సక్రమంగా ఇస్తున్నారా లేదా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఇంతలో ఎమ్మెల్యే వెంట వచ్చిన ఓ టీడీపీ కార్యకర్త అక్కడ ఉన్న జ్వరం-జలుబు సిరప్‌ను పరిశీలించి ఈ నెల 30తో కాల పరిమితి అయిపోతుందని గుర్తించాడు. అంతే ఎమ్మెల్యే ఇంతెత్తున లేచి ఆమెపై చిందులు తొక్కారు. అసలే అన్నం తినకపోవడం.. ఆందోళనకు గురికావడంతో ఏఎన్ఎం మాధవీలత సొమ్మసిల్లి పడిపోయారు. దీంతో ఆమెను ఎమ్మెల్యే కాన్వాయి కారులోనే అనంతపురంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.



ప్రిన్సిపాల్ విజయలక్ష్మిపై మండిపడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణి

స్కూల్ కమిటీ ఎన్నికల్లో మాట వినలేదనేనా!

ఇటీవల జరిగిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల్లో ఎమ్మెల్యే వర్గీయులు ఓటమిపాలయ్యారు. చైర్మన్ ఎన్నికను నిలిపివేయాలని ఎమ్మెల్యే శ్రావణిశ్రీ సూచించగా... కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఎన్నికలు పూర్తి చేయాల్సి ఉందని పాఠశాల సిబ్బంది సమాధానం చెప్పారు. దీంతో 'మీ పాఠశాలకు తనిఖీ కోసం వస్తా.. అప్పుడు చెప్తా మీ కథ' అని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారని సమాచారం. అందులో భాగంగానే గురుకుల పాఠశాలను తనిఖీ చేసి సిబ్బందిపై శివాలెత్తి హడలెత్తించినట్లు స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు.

'నవోదయ' దరఖాస్తు గడువు 7 వరకు పొడిగింపు

అనంతపురం ఎడ్యుకేషన్: లేపాక్షి నవోదయ పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశానికి నిర్వహించే పరీక్షకోసం దరఖాస్తు గడువు అక్టోబరు 7 వరకు పొడిగించారు. www. navodaya.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి బి.వరలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. జిల్లా వాసులకు మాత్రమే అవకాశం అన్నారు. హెచ్ఎం/ ప్రిన్సిపాల్ జారీ చేసిన స్టడీ సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ/ ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 3, 4వ తరగతి చదివి ఉత్తీర్ణత సాధించి ఉండాలని, 01–05–2013 నుంచి 31- 07–2015 మధ్య జన్మించిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వివిధ కేటగిరీల్లో రిజర్వేషన్లు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

జీఎంసీలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి తనిఖీలు



రక్షణ చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి శివప్రసాద్‌యాదవ్

అనంతపురం మెడికల్: ప్రభుత్వ వైద్య కళాశాల (జీఎంసీ)ని శుక్రవారం ఉదయం జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి జి.శివప్రసాద్‌యాదవ్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ తనిఖీల్లో కళాశాల విద్యార్థులతో ఆయన మాట్లాడారు. వేధింపులపై డీఎల్ఎస్ఏ ద్వారా అందించే సాయంతో పాటు, రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. కళాశాలలో వేధింపులు, ఇతర సమస్యలు ఉంటే నిర్భయంగా తెలపాలన్నారు.

పరిశ్రమల స్థాపనపై దృష్టి సారించండి : కలెక్టర్

అనంతపురం అర్బన్: జిల్లాలో నూతన పరిశ్రమల ఏర్పాటు అంశంపై దృష్టి సారించి, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పరిశ్రమల ఎగుమతి ప్రోత్సాహ కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ... సింగిల్ విండో పోర్టల్ ద్వారా పరిశ్రమల ఏర్పాటుకు చేసుకున్న దరఖాస్తులను నిర్ణీత వ్యవధిలోపు ఆమోదించాలని సూచించారు. పీఎంఈజీపీ పథకం ద్వారా రుణం మంజూరైన యూనిట్లన్నీ గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనాలను నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చే కేంద్రాలుగా మార్చాలన్నారు. అనంతరం 2023–27 ఇండస్ట్రియల్ పాలసీలో భాగంగా 23 యూనిట్లకు రూ.3.40 కోట్లు సబ్సిడీ మంజూరుకు సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు శేషాంజినేయులు, పరిశ్రమల శాఖ అధికారి రాజశేఖర్‌రెడ్డి, డీపీఓ ఉమామహేశ్వరమ్మ, నగర పాలక సంస్థ కమిషనర్ నాగరాజు, ఫ్యాక్టరీస్ డీడీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారించండి

రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో రోడ్డు భద్రతా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఎస్పీ పి.జగదీష్‌తో కలసి కలెక్టర్ మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలు, మరణాలను తగ్గించేందుకు ప్రణాళికాబద్ధంగా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో డీటీసీ వీర్రాజు, డీఎస్పీ శ్రీనివాస్, ట్రాఫిక్ సీఐ రఘుప్రసాద్, ఆర్టీసీ ఆర్ఎం సుమంత్, ఆస్పత్రి సూపరింటెండెంట్ కె.ఎస్.వెంకటేశ్వరరావు, ఆరోగ్య శ్రీ కో–ఆర్డినేటర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ ఓబుళరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పగబట్టిన విధి

రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబంపై విధి పగ బట్టింది. ఆ కుటుంబాన్ని పక్షవాతం రూపంలో అవస్థ పెడుతోంది. ఎదురొడ్డి నిలబడదామనుకునే లోపు ఒకరి తర్వాత ఒకరు చొప్పున ముగ్గురినీ మంచాన పడేసింది. కుటుంబ బండి ముందుకు సాగక ఆగిపోయింది. కనీస వైద్య చికిత్సలు సైతం అందుకోలేక విలవిల్లాడుతున్న ఆ కుటుంబ దీనస్థితిపై 'సాక్షి' కథనం. –యాడికి

- కుటుంబమంతా మంచానికే పరిమితం
- 12 ఏళ్ల క్రితం అత్త, 8 ఏళ్ల క్రితం భర్త, ప్రస్తుతం కోడలు...
- ఒకే ఇంట్లో ముగ్గురికి పక్షవాతం
- పూట గడవక ఇబ్బందులు
- ఆకలి, దప్పికలు తీరుస్తున్న 'అగాపే'

యాడికిలోని ఆస్పత్రి కాలనీలో నివాసముంటున్న నాగమ్మ, వెంకటదాసు దంపతులకు ఒక్కగానొక్క కుమారుడు నాగరాజు ఉన్నాడు. నేత పనులతో జీవనం సాగిస్తున్న వీరికి సొంత ఆస్తిపాస్తులంటూ ఏమీ లేవు. ఆస్పత్రి కాలనీలో ఓ చిన్న పాటి గదిని అద్దెకు తీసుకుని అందులోనే కాలం నెట్టుకొస్తున్నారు. బాడుగ మగ్గం ఏర్పాటు చేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్న వెంకటదాసు దాదాపు 20 ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి కుటుంబ బాగోగులు నాగమ్మపై పడ్డాయి. బాడుగ మగ్గంపై చీరలు నేస్తూ వచ్చే అరకొర సంపాదనతోనే కుమారుడిని పెంచి పెద్ద చేసి పెళ్లి చేసింది. ముగ్గురూ కలసి అద్దె మగ్గంపై చేనేత ఉత్పత్తులను నేస్తూ ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా సాఫీగా జీవనం సాగిస్తున్న తరుణంలో 2012న నాగమ్మకు పక్షవాతం సోకి మంచాన పడింది.

సరిగ్గా నాలుగేళ్లు తిరగకనే మరొకరికి

12 ఏళ్ల క్రితం పక్షవాతం సోకిన నాగమ్మకు కాలు, చెయ్యి పడిపోయింది. నోట మాటరాలేదు. దీంతో ఆమెను నంద్యాల జిల్లా గుండుపాపల గ్రామానికి కుమారుడు నాగరాజు పిలుచుకెళ్లి నాటు వైద్యం చేయించాడు. చికిత్స చేయించిన రెండేళ్ల తర్వాత నాగమ్మకు చెయ్యి మాత్రమే పనిచేయడం మొదలైంది. అయితే కాలు పనిచేయడం లేదు. దీంతో కదల్లేక ఒకే చోట ఉండిపోతోంది. మాట కూడా రాలేదు. నాగరాజు, నారాయణమ్మ దంపతులు మగ్గం నేస్తూ నాగమ్మకు ఏ లోటు రానివ్వకుండా చూస్తూ వచ్చారు. తల్లి మంచాన పడి నాలుగేళ్లు తిరగకనే 2016లో విధి మరోసారి వక్రీకరించడంతో పక్షవాతం సోకి నాగరాజు మంచాన పడ్డాడు. దీంతో బంధువుల సాయం తీసుకుని భర్తను గుండుపాపల గ్రామానికి నారాయణమ్మ పిలుచుకెళ్లి చికిత్స చేయించింది. అయినా ఫలితం దక్కలేదు. చెయ్యి, నోరు పడిపోయింది. ఓ కాలు కూడా సక్రమంగా పనిచేయడం లేదు. దీంతో నాగరాజు సైతం ఇంటికే పరిమితమయ్యాడు.

ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తూ...

ఓ వైపు అత్త... మరో వైపు భర్త... పక్షవాతం బారిన పడి మంచాన పడడంతో ఒక్కసారిగా ఆ ఇంటి కోడలు నారాయణమ్మకు దిక్కుతోచలేదు. తమ జీవితాలతో ఆడుకుంటున్న విధాతపై ఆత్మస్థైర్యంతో ఒంటరిపోరుకు సిద్ధమైంది. ఓ వైపు మగ్గం పని చేసుకుంటూనే మరో వైపు అత్తకు, భర్తకు సపర్యలు చేస్తూ వచ్చింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటి వద్దకెళ్లిన వలంటీర్ అక్కడి పరిస్థితిని గమనించి వెంటనే సచివాలయ ఉద్యోగుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో నాగమ్మకు వృద్ధాప్య పింఛన్, నాగరాజుకు చేనేత పింఛన్ మంజూరైంది. ఇది నారాయణమ్మకు కొండంత ధైర్యాన్ని అందించింది. పింఛన్ సొమ్ము మొత్తాన్ని అత్త, భర్త వైద్య ఖర్చులకే వెచ్చిస్తూ వచ్చింది. ఇలాంటి తరుణంలో ఆమె ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తూ విధి మరోసారి వెక్కిరించింది. మూడు వారాల క్రితం పక్షవాతం సోకి నారాయణమ్మ మంచాన పడింది.



పక్షవాతంతో బాధపడుతున్న ముగ్గురికీ అన్నం తినిపిస్తున్న ప్రసాద్

సొంత పనులూ చేసుకోలేక

నారాయణమ్మ దుస్థితిని చుట్టుపక్కల వారి నుంచి తెలుసుకున్న దూరపు బంధువు రామకృష్ణ వెంటనే స్పందించారు. నారాయణమ్మను గుండుపాపల గ్రామానికి పిలుచుకెళ్లి చికిత్స చేయించుకుని వచ్చాడు. చికిత్స అనంతరం నోట మాట వచ్చింది కానీ, కాలు, చెయ్యి పనిచేయక పోవడంతో నారాయణమ్మ కూడా మంచానికే పరిమితమైంది. మాట రాక భర్త, అత్త సైగలు చేస్తూ వారి అవసరాలు చెబుతుంటే... వాటిని తీర్చలేని దుస్థితిలో నారాయణమ్మ కంట నీరు పెట్టుకుని కుమిలిపోతోంది. సొంత పనులు కూడా చేసుకోలేక నిస్సహాయ స్థితిలో ప్రస్తుతం ఆ కుటుంబం కొట్టుమిట్టాడుతోంది. కుటుంబంలోని ముగ్గురూ పక్షవాతం బారిన పడి జీవచ్ఛవాల్లా ఉన్నారనే విషయం తెలుసుకున్న యాడికిలోని కమలపాడు రహదారిలో ఉన్న అగాపే వృద్ధాశ్రమ నిర్వాహకుడు ప్రసాద్ స్పందించారు. ప్రతి రోజూ ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనాన్ని ఇంటి వద్దకే తీసుకెళ్లి దగ్గరుండి తినిపిస్తున్నారు. భయపడొద్దని, అండగా తానుంటానంటూ భరోసానిచ్చారు. ప్రసాద్ తప్ప ఇంకెవ్వరూ ఆ ఇంటి ఛాయలకు కూడా పోవడం లేదు. దీంతో నా అనే వారు ఎవరూ లేక ఆ కుటుంబం అనాథలా మారింది.

ఆ కుటుంబాన్ని ఆదుకుంటా..



పక్షవాతం బారిన పడి కుటుంబంలోని అందరూ మంచానపడడం చాలా బాధాకరం. మా వృద్ధాశ్రమంలో 30 మంది వరకు అనాథలు, వృద్ధులు ఉన్నారు. ప్రత్యేక షెడ్డు వేయించాల్సి ఉంది. షెడ్డు నిర్మాణం పూర్తికాగానే వీరిని కూడా ఆశ్రమానికి చేరుస్తా. నా ఊపిరి ఉన్నంత వరకూ నాగమ్మ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటా.

– ప్రసాద్, అగాపే వృద్ధాశ్రమ నిర్వాహకుడు, యాడికి

నలుగురు ఎంపీఈవోలపై విచారణ



విచారణకు హాజరైన చిత్తూరు జిల్లా ఏడీఏలు, ఏఓలు

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాకు చెందిన నలుగురు మల్టీ పర్పస్ ఎక్స్‌టెన్షన్ అసిస్టెంట్ల (ఎంపీఈఓ) అంశంపై అనంతపురంలోని సాయిల్ కన్జర్వేషన్ (ఎస్‌సీ) కార్యాలయంలో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ విచారణ కొనసాగింది. జేడీఏ ఆదేశాల మేరకు విచారణాధికారిగా నియమితులైన ఎస్‌సీ డీడీఏ శివప్రసాద్ సారథ్యంలో ఐదారు మంది సభ్యులుగా ఉన్న బృందం లిఖిత పూర్వక వాంగ్మూలాలు, ఇతర డాక్యుమెంట్ల నకళ్లను తీసుకున్నారు. వ్యవసాయశాఖ పరిధిలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఎంపీఈఓలు ఎం.రాధిక, ఎన్.శివజ్యోతి, బి.లక్ష్మి, పి.భవ్యను 2022లో చిత్తూరు జిల్లాకు డిప్యుటేషన్‌పై బదిలీ చేశారు. వారు అక్కడ విధుల్లో చేరిన తర్వాత కొద్దిరోజులకు దీర్ఘకాలిక సెలవు పెట్టి ఏడాది క్రితం విధుల్లో చేరడానికి వెళితే... అటు చిత్తూరు జిల్లా ఇటు అనంతపురం జిల్లా అధికారులు తిరస్కరించినట్లు తెలుస్తోంది. విధుల్లోనూ చేరకపోవడమే కాక, దీర్ఘకాలిక సెలవులకు తమ అనుమతి లేనందున వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవడం తమ చేతుల్లో లేదంటూ చిత్తూరు జిల్లా అధికారులు చేతులెత్తేసినట్లు చెబుతున్నారు. దీంతో తమకు న్యాయం చేయాలంటూ నలుగురు ఎంపీఈఓలు మూడు పర్యాయాలు కమిషనరేట్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎట్టకేలకు ఈ అంశంపై విచారణకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ క్రమంలో విచారణకు హాజరు కావాలని చిత్తూరు జిల్లాకు చెందిన ముగ్గురు ఏడీఏలు, ఐదారు మంది ఏఓలతో పాటు బాధిత నలుగురు ఎంపీఈఓలకూ నోటీసులిచ్చారు. దీంతో వీరందరూ శుక్రవారం విచారణాధికారి బృందం ఎదుట హాజరై వివరణ ఇచ్చారు.

ఏఎన్ఎంలకు ఇతర బాధ్యతలు అప్పగించరాదు

- కలెక్టర్‌కు ఏపీఎన్జీఓ సంఘం నేతల వినతి

అనంతపురం అర్బన్: వైద్యారోగ్యశాఖకు సంబంధించి సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రేడ్–3 ఏఎన్ఎంలకు ఇతర శాఖల సర్వేలు, పింఛన్ పంపిణీ తదితర శాఖేతర బాధ్యతలను అప్పగించరాదంటూ కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌కు ఏపీఎన్జీఓ సంఘం నాయకులు, ఏఎన్ఎంలు విన్నవించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను శుక్రవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి, కార్యదర్శి చంద్రమోహన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ్, మహిళా విభాగం చైర్‌పర్సన్ జమీలా బేగం తదితరులు కలసి వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. ఏఎన్ఎంలకు ఇతర శాఖల పనులు అప్పగించరాదంటూ ఈ ఏడాది జనవరి 23న ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను పక్కాగా అమలు చేయాలని కోరారు. జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమాలకు సంబంధించి సేవలను లబ్ధిదారులకు నిర్దేశించిన సమయంలో అందించడంతో పాటు అదే రోజున ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సిన గురుతర బాధ్యత ఏఎన్ఎంలపై ఉందన్నారు. రోజువారీగా ఏఎంబీ, ఏఆర్ బర్త్ ప్లాన్, తదితర కార్యక్రమాలతో పాటు డ్రైడేలో భాగంగా ప్రతి శుక్రవారమూ ఇంటింటి కార్యక్రమం నిర్వహించాల్సి వస్తోందన్నారు. వివిధ కార్యక్రమాలతో ఇప్పటికే తలమునకలుగా ఉంటున్న ఏఎన్ఎంలకు సచివాలయాల పరిధిలో చేపట్టే అన్ని శాఖల సర్వేలు, పింఛన్ల పంపిణీ బాధ్యతలు అప్పగించడం బాధాకరమన్నారు. అన్ని కార్యక్రమాలు ఏకకాలంలో అమలు చేయాలని అధికారులు ఒత్తిడి చేస్తుండడంతో మానసికంగా ఆందోళనకు గురై అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. వీరి శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఏఎన్ఎం గ్రేడ్–3లను పూర్తిగా మాతృశాఖకు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎన్జీఓ సంఘం కోశాధికారి ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శి లింగమేష్, సంయుక్త కార్యదర్శి జి.మహేశ్వర్‌రెడ్డి, ఇతర నాయకులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన ఏపీఎన్జీఓ సంఘం నాయకులు, సచివాలయ ఏఎన్ఎంలు

ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అనుచరుల దౌర్జన్యం

- తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదన్న ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయిస్వామి

అనంతపురం రూరల్: ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని అధికారులను కోరేందుకు వచ్చిన తమపై మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అనుచరులు దౌర్జన్యానికి దిగడం హేయమని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయిస్వామి మండిపడ్డారు. ప్రభుత్వ ఎస్సీ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పెన్నార్ భవన్‌లో ఉన్న జిల్లా సాంఘిక సంక్షేమ కార్యాలయం ఎదుట శుక్రవారం ఉదయం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఆ సమయంలో ఎంఎస్ రాజు అనుచరులు అక్కడకు చేరుకుని విద్యార్థులు, ఏఐఎస్ఎఫ్ నాయకులపై దౌర్జన్యానికి దిగారు. అదే సమయంలో అక్కడకు సిబ్బందితో కలసి సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ చేరుకున్నారు. పోలీసుల సమక్షంలోనే విద్యార్థి సంఘం నేతలపై ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అనుచరులు దూషణలకు దిగారు. టీడీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి పోలీసులు సైతం విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేశారు. సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ ఆదేశాలతో విద్యార్థులను పెన్నార్ భవన్ ఆవరణ నుంచి పోలీసులు బలవంతంగా బయటకు గెంటేశారు. కుల్లాయిస్వామి మాట్లాడుతూ... ఎస్సీ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తాము సాగిస్తున్న పోరాటానికి ఓ దళిత ఎమ్మెల్యే మద్దతు ఇవ్వకపోగా... తన అనుచరులతో దౌర్జన్యం చేయించడం బాధాకరమన్నారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తాటాకు చప్పుళ్లకు తాము భయపడబోమన్నారు. ప్రభుత్వ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కారమయ్యే వరకూ పోరాటం సాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు నరసింహయాదవ్, వెంకట్‌నాయక్, వంశి, చందు, మంజునాథ్ పాల్గొన్నారు.



సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ సమక్షంలోనే విద్యార్థి సంఘం నేతలపై దౌర్జన్యం చేస్తున్న ఎంఎస్ రాజు అనుచరులు

టీటీసీ థియరీ పరీక్షల వాయిదా

అనంతపురం ఎడ్యుకేషన్: వచ్చే నెల 6న జరగాల్సిన టీటీసీ థియరీ లోయర్ గ్రేడ్ పరీక్షలు వాయిదా పడ్డాయి. ఈ మేరకు డీఈఓ బి.వరలక్ష్మి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఏపీ టెట్ పరీక్షల కారణంగా వాయిదా వేసిన టీటీసీ థియరీ పరీక్షలను అక్టోబర్ 27న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలి : డీఈఓ

ఆత్మకూరు: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని డీఈఓ వరలక్ష్మి హెచ్చరించారు. శుక్రవారం ఆత్మకూరులోని జెడ్పీహెచ్ఎస్‌ను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనంలో నాణ్యత, పాఠశాలలో ఏర్పాటు చేసిన ల్యాబ్‌ను పరిశీలించారు. పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంఈఓలు నరసింహారెడ్డి, రామాంజినేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'పీహెచ్‌సీ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచండి'

పీహెచ్‌సీ పరిసరాలు ఇంత అపరిశుభ్రతతో ఉంటే రోగులకు జబ్బులు ఎలా నయమవుతాయి? ఇదేనా మీ పనితీరు? అంటూ ఆత్మకూరు పీహెచ్‌సీ సిబ్బందిపై డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం స్థానిక పీహెచ్‌సీని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. అపరిశుభ్రంగా ఉన్న ఆస్పత్రి పరిసరాలు చూసి సిబ్బందిపై మండిపడ్డారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు అథ్లెట్ల ఎంపిక

అనంతపురం: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో త్వరలో శ్రీకాకుళం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో పాల్గొనే క్రీడాకారులను శుక్రవారం అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఎంపిక చేశారు. అండర్–17 బాల, బాలికల 100 మీటర్ల పరుగులో టి. రాజేష్, కె.ముఖేష్, హెచ్ అర్చన, ఎస్.లక్ష్మి, 200 మీటర్ల పరుగులో డి.హరిశంకర్, డి.శశికాంత్, జి.యశస్విని, ఎ.ఇంద్రలేఖ, 400 మీటర్ల పరుగులో హరిశంకర్, టి.రాజేష్, ఇంద్రలేఖ, సి.ఉదయశ్రీ, 3వేల మీటర్ల పరుగులో యశ్వంత్, పవన్, డి.సమీరా, హారిణి ఎంపికయ్యారు. లాంగ్‌జంప్‌లో జి. యశస్విని, ఆర్.మానస, డి.నరసింహారెడ్డి, సుదర్శన్, హై జంప్‌లో డి.హర్ష, ఎం.వాణి, వి.సిద్ధార్థ, వై.బన్నీ, షార్ట్‌పుట్‌లో వి.సరస్వతి, రమ్యశ్రీ, డి.వసంత్, బి.దేవేంద్రనాయక్, 5వేల మీటర్ల పరుగులో హేమంత్‌కుమార్, మధు, 3 వేల మీటర్ల (నడక) పి. మౌనిక, హెచ్.వర్షిత, 800 మీటర్ల పరుగులో లాస్యరెడ్డి, ఉదయశ్రీ ఎంపికయ్యారు.

చిన్నారిపై కుక్కల దాడి

గుత్తి: ఐదేళ్ల చిన్నారిపై కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. ఆర్ఎస్‌లోని వంకగడ్డ వీధికి చెందిన ప్రసాద్ కుమార్తె రోష్ని... శుక్రవారం రామాలయం వీధిలో ట్యూషన్‌కు వెళుతున్న సమయంలో కుక్కలు దాడి చేశాయి. స్థానికులు అప్రమత్తమై బాలికను కాపాడి, ఆస్పత్రికి చేర్చారు. చికిత్స అనంతరం చిన్నారిని తల్లిదండ్రులు ఇంటికి పిలుచుకెళ్లారు.

యువతి మృతదేహం లభ్యం



ఇందుప్రియ (ఫైల్)

బొమ్మనహాళ్: హెచ్చెల్సీ గల్లంతైన కర్ణాటకలోని బళ్లారికి చెందిన ఇందుప్రియ (25) మృతదేహం బొమ్మనహాళ్ సరిహద్దులో గురువారం రాత్రి తేలింది. బళ్లారి రూరల్ పోలీసులు తెలిపిన మేరకు... ఇందుప్రియా మంగళవారం అదృశ్యమైనట్లు బళ్లారిలోని మహిళా పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు అందింది. విచారణలో బండట్టిలోని హెచ్చెల్సీలో పడినట్లుగా గుర్తించారు. అప్పటి నుంచి గాలింపు కొనసాగుతూ వచ్చింది. మృతురాలి తండ్రి ఎర్రిస్వామి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

జీతం బకాయిల చెల్లింపులకు రూ. 60 వేలు డిమాండ్

- వెలుగు చూసిన ఎంపీడీఓ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ అవినీతి బాగోతం
- లంచం లేనిదే ఏ పనీ చేయని వైనం

గుంతకల్లు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పని చేసిన ఓ జూనియర్ అసిస్టెంట్ తీరు సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. తన టేబుల్‌పైకి వచ్చే ప్రతి పనికీ ఓ ధర నిర్ణయించి సొమ్ము దండుకునేవాడిగా ఆరోపణలున్నాయి. లంచం లేనిదే సొంత శాఖ ఉద్యోగుల పనిని సైతం పూర్తి చేయకుండా కాలయాపన చేసేవాడు. ఈ క్రమంలో ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ఇక్కడి నుంచి విడపనకల్లు మండలానికి బదిలీ కావడంతో ఆయన అవినీతి, అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి.

ఉద్యోగుల బలహీనతలే ఆసరాగా.....

తాను పనిచేస్తున్న కార్యాలయంలోని ఉద్యోగుల బలహీనతలను ఆసరాగా చేసుకుని వారితో సదరు జూనియర్ అసిస్టెంట్ చెలగాటమాడేవాడు. గుంతకల్లు ఎంపీడీఓ కార్యాలయంలో పనిచేసే సమయంలో సిబ్బందితోపాటు మండలంలోని అన్ని సచివాలయాల్లోని ఉద్యోగులకు జీతాలు, ఇంక్రిమెంట్లు, సెలవులు ఇలా తనది కాని ప్రతి పనిలోనూ జోక్యం చేసుకుంటూ అక్రమార్జనకు తెరలేపాడు. ఈ క్రమంలోనే నాలుగు నెలలుగా సిక్ లీవ్ మీద వెళ్లిన ఓ గ్రామ సచివాలయ మహిళా ఉద్యోగిని ఇటీవల తిరిగి విధుల్లో చేరారు. దీంతో ఆమెకు నాలుగు నెలల జీతం బకాయిలు చెల్లించేందుకు ఏకంగా రెండు నెలల జీతాన్ని (రూ.60 వేలు) డిమాండ్ చేశాడు. చివరకు రూ.30 వేలు సమర్పించుకుంటే కానీ ఆమె ఫైలు ముందుకు సాగలేదు. సొంత శాఖ ఉద్యోగికి జరిగిన అన్యాయంపై సహోద్యోగులు, సచివాలయ పరిధిలోని గ్రామస్తులు మండి పడుతూ విషయాన్ని ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లారు.

బ్లాక్‌మెయిల్ చేసి మరింత..

తనకు ఎదురు తిరిగిన పంచాయతీ కార్యదర్శులు, ఉద్యోగులపై జూనియర్ అసిస్టెంట్ కక్ష కట్టి వ్యవహరించేవాడు. ఈ క్రమంలో వారిని బ్లాక్‌మెయిల్ చేసి మరింత డబ్బు గుంజేవాడు. ఇందుకు తనకు అనుకూలంగా ఉన్న సామాజిక కార్యకర్తలను అడ్డుగా వేసి, వారి ద్వారా సమాచారం సేకరణ పేరుతో ఆర్టీఐ యాక్ట్ కింద డబ్బు తానే కట్టేవాడు. అనంతరం ఈ విషయం తన దృష్టికి వచ్చిందని, ఇద్దరి మధ్య రాజీ చేస్తానంటూ దుప్పటి పంచాయితీ నిర్వహించి పెద్ద మొత్తంలో డబ్బు లాగి అందులో సగం తన ఖాతాలోకి వేసుకునేవాడు. అలాగే పలు అభివృద్ధి పనులకు సంబంధించి కూడా వివరాల సేకరణ పేరుతో ఆర్టీఐ యాక్ట్‌ను అడ్డగోలుగా ఉపయోగిస్తూ... కాంట్రాక్టర్లు, ఉద్యోగులను బ్లాక్‌మెయిల్ చేసి రూ.లక్షల్లో అక్రమ వసూళ్లకు పాల్పడినట్లుగా ఆరోపణలున్నాయి.

ఆయన తీరు వివాదాస్పదమే

కార్యాలయంలో పనిచేసిన జూనియర్ అసిస్టెంట్ పనితీరు వివాదాస్పదంగానే ఉంది. మెడికల్ లీవ్‌లో లంచం దండుకున్న విషయం నా దృష్టికి వచ్చింది. గతంలోనూ ఆయన పనితీరుతో విసుగు చెందిన ట్రెజరీ, ఎంఈఓ సిబ్బంది, ఉద్యోగులు పలు మార్లు గొడవ పడ్డారు. అయినా ఆయన తీరు మారలేదు. ప్రస్తుతం ఆయన విడపనకల్లు మండలానికి బదిలీ అయ్యాడు.

– శ్రీకాంత్ చౌదరి, ఎంపీడీఓ, గుంతకల్లు

అన్నదాతపై సీఐ యుగంధర్ జులుం



బాధిత రైతు బంగారు శ్రీనివాసరెడ్డి

పామిడి: అన్నదాతపై పామిడి సీఐ యుగంధర్ విరుచుకుపడ్డాడు. ఏడు పదుల వయసులో ఉన్న రైతుపై ఏకంగా బెల్ట్‌తో దాడి చేసి వివాదానికి తెర లేపాడు. ఘటనపై బాధిత రైతు ఆవేదన ఆయన మాటల్లోనే...

'నా పేరు బంగారు శ్రీనివాసరెడ్డి. పి.కొత్తపల్లి గ్రామానికి చెందిన నేను 2002లో పామిడిలోని గుండప్పరావు కాలనీ లే ఔట్‌లో 170, 171, 172 నంబర్ల ప్లాట్లను కొనుగోలు చేసి నా భార్య బి.లక్ష్మి పేరుతో రిజిస్టర్ చేయించా. అదే రోజే అదే సర్వే నంబర్‌లోని 73, 74 ప్లాట్లలో మొత్తం 3 సెంట్ల స్థలానికి రూ.54వేలు ధరను లేఔట్ నిర్వాహకులు యు.సతీష్‌కుమార్, యు.నరేంద్రకుమార్ (అన్నదమ్ములు) నిర్ణయించడంతో వాటికి కూడా అదే రోజు రూ.5 వేలు అడ్వాన్స్ చెల్లించి మూడేళ్లలోపు రిజిస్టర్ చేయించుకుంటానని అగ్రిమెంట్ చేయించుకున్నా. ఒప్పందం మేరకు మూడేళ్ల తర్వాత రిజిస్ట్రేషన్ చేయించాలని కోరితే బకాయి రూ.49వేలకు రూ.2 వడ్డీ చొప్పున చెల్లించాలని లేఔట్ నిర్వాహకులు డిమాండ్ చేస్తే అందుకూ ఒప్పుకున్నా. అదే సమయంలో అన్నదమ్ముల మధ్య మనస్పర్థలు తలెత్తడంతో రిజిస్ట్రేషన్ కాస్త ఆగిపోయింది. దీంతో అప్పటి సీఐ చొరవతో అన్నదమ్ములను నేనే దగ్గరుండి రాజీ చేయించినా స్థలాన్ని రిజిస్టర్ చేసివ్వకుండా వచ్చారు. దీనిపై న్యాయం చేయాలని కోరుతూ గత సోమవారం ఎస్పీ ని కలసి వినతి పత్రం ఇచ్చా. దీనిపై ఎస్పీ సూచన మేరకు గురువారం సాయంత్రం పామిడిలో సీఐ యుగంధర్‌ను కలిశా. నన్ను చూడగానే ఆయన ఒక్కసారిగా ఊగిపోయారు. తనను కాదని ఎస్పీని కలిసినందుకు బూతుల తో విరుచుకుపడి నా వద్ద ఉన్న అగ్రిమెంట్‌ను లాక్కొని చించి అవతల పడేశాడు. నా సెల్ లాక్కొన్ని నేలకేసి కొట్టాడు. వయసులో పెద్దవాడినని కూడా చూడకుండా చెంపపై బలంగా కొట్టి, బెల్ట్ తీసి చితకబాదాడు'.

బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడు

22 ఏళ్ల నాటి అగ్రిమెంట్ తెచ్చి న్యాయం చేయాలంటే అగ్రిమెంట్ చెల్లుబాటు కాదని నచ్చ చెప్పి పంపాను. ఆయనను తిట్టింది లేదు. కొట్టింది లేదు. కావాలనే బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడు.

– యుగంధర్, సీఐ

వలస కార్మికుడి మృతి

అనంతపురం: బతుకు తెరువు కోసం వలస వచ్చిన ఓ కార్మికుడు ప్రమాదవశాత్తు తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కర్నూలు జిల్లా కోసిగి మండలం వందగల్లు గ్రామానికి చెందిన ఆంజనేయులు (30) భవన నిర్మాణ పనులతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో జేఎన్‌టీయూకు ఎదురుగా ఉన్న కాలనీలో నిర్మాణంలో ఓ భవనానికి శుక్రవారం ఉదయం సెంట్రింగ్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడ్డాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆంజనేయులను తోటి కార్మికులు వెంటనే జీజీహెచ్‌కు తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందాడు. ఘటనపై అనంతపురం వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వృద్ధురాలి బలవన్మరణం

అనంతపురం: ఆత్మహత్యాయత్నం చేసిన రుద్రంపేటకు చెందిన సరిత కుళ్లాయమ్మ (75) శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందింది. గురువారం సాయంత్రం ఆమె యాసిడ్ తాగింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే జీజీహెచ్‌కు తరలించారు. చికిత్సకు స్పందించక శుక్రవారం ఆమె మృతి చెందింది. ఘటనపై నాల్గో పట్టణ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

కేఎస్ఎన్‌లో ఫ్రెషర్స్ డే



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే ఘనంగా జరుపుకున్నారు. ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు ప్రథమ విద్యార్థులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శంకరయ్య మాట్లాడుతూ.. భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థినులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీరంగయ్య, అధ్యాపకులు డాక్టర్ రామాంజనేయులు, రమణ నాయుడు, తిమ్మారెడ్డి, శివశంకర్, మేరీ మాధురి, పర్వీన్, ఫాతిమా బేగం, అంజనరెడ్డి, రామకృష్ణ, షఫీ తదితర పాల్గొన్నారు.

నేడు జాషువా జయంతి

అనంతపురం కల్చరల్: మహాకవి గుర్రం జాషువా జయంతి శనివారం జాషువా సాహిత్య పీఠం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజ్ సమీపంలోని గుర్రం జాషువా విగ్రహానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, జాషువా అభిమానులు పూలమాలలతో నివాళులర్పిస్తారు. 10 గంటలకు కళాశాలలోని కామర్స్ సెమినార్ హాలులో ఆచార్య బాలసుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగే సాహిత్య సదస్సుకు ప్రముఖ కవులు, రచయితలు, విద్యావేత్తలు హాజరవుతారు. మహాకవికి నివాళులర్పించేందుకు అందరూ తరలి రావాలని సాహిత్యపీఠం ప్రతినిధులు నాగలింగయ్య, నాగేంద్ర ఓ ప్రకటనలో తెలిపారు.

విద్యుత్‌శాఖ ఏఈ బాధ్యతల స్వీకరణ



ఏఈ మునిరాజ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

అనంతపురం టౌన్: విద్యుత్ శాఖ డిస్ట్రిబ్యూషన్-5 ఏఈగా జి.మునిరాజ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇన్‌చార్జ్ ఏఈగా పని చేస్తున్న ప్రసాద్‌ను విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్ రిలీవ్ చేశారు. శింగనమల నియోజకవర్గ కేంద్రంలో ఏఈగా పని చేస్తున్న మునిరాజ్‌ను అనంతపురం డిస్ట్రిబ్యూషన్-5 ఏఈగా బదిలీ చేశారు. ఈ సందర్భంగా లైన్ ఇన్‌స్పెక్టర్ మస్తానయ్య, లైన్‌మెన్లు వెంకటనారాయణ, నాగేంద్ర, పరమేష్, విద్యుత్ సంస్థ కాంట్రాక్టర్లు మాధవరెడ్డి, సుధీర్‌రెడ్డి తదితరులు నూతన ఏఈకి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

'బహిర్భూమికి వెళ్లి కన్ను మూశాడు'



జెన్నే లక్ష్మన్న (ఫైల్)

రాప్తాడు రూరల్: ఉదయం లేచి బహిర్భూమికి వెళ్లిన ఓ వ్యక్తి గుండెపోటుతో కన్ను మూశాడు. ఈ విషాద ఘటన అనంతపురం రూరల్ మండలం ఆలమూరులో శుక్రవారం చోటు చేసుకుంది. జెన్నే లక్ష్మన్న (37), శాంతి దంపతులు. వీరికి కుమారుడు, కూతురు సంతానం. లక్ష్మన్న బేల్దారి పనులు చేసుకుంటుండగా.. భార్య కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గురువారం రాత్రి ఇంట్లో పడుకున్న లక్ష్మన్న శుక్రవారం తెల్లవారుజామున 4:30 గంటల సమయంలో లేచి బహిర్భూమికి వెళ్లాడు. ఊరి చివరలో ఉన్న గంగమ్మ ఆలయం వద్ద అపస్మారక స్థితిలో పడిపోయాడు. 5 గంటల సమయంలో ఆటుగా వెళ్లిన గ్రామస్తులు గుర్తించి వెంటనే లక్ష్మన్న కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అలాగే 108 కు సమాచారం అందించారు. వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. పరిశీలించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ఈఓగా బాబు



ఈఓలను సన్మానించిన ఆలయ సిబ్బంది

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ నూతన ఈఓగా బాబు శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా నూతన ఈఓకు ఆలయ అర్చకులు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. బాబు గతంలో గార్లదిన్నె సమూహ ఆలయ ఈఓగా పని చేశారు. బదిలీపై పంపనూరు ఈఓగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఈఓగా పని చేసిన అక్కిరెడ్డి అనంతపురం గ్రూప్-4 ఆలయ ఈఓగా బదిలీ అయ్యారు. అనంతరం ఈఓ అక్కిరెడ్డిని ఆలయ అర్చకులు, సిబ్బంది శాలువా కప్పి, పూలమాలలతో సన్మానించారు.



ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం దుస్థితి ఇలా..



నెర్రెలు చీలిన ఆర్టీసీ బస్టాప్ కాంప్లెక్స్

శిథిలావస్థలో భవనాలు..
భయం గుప్పిట్లో విధులు

జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కార్యాలయ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. పాత భవనాలు కావడంతో భవనాలు పెచ్చులూడి, ఇనుప కడ్డీలు దర్శనమిస్తున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని కార్యాలయంలో పని చేసే సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక వర్షాకాలంలో గోడల నుంచి నీరు కారుతుండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఆర్టీసీ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలనిసిబ్బంది ప్రయాణికులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



ఆర్టీసీ బస్టాప్ కాంప్లెక్స్ బయట పడేసిన వ్యర్థాలు



ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయంలో పెచ్చులూడటంతో ఇనుప కడ్డీలు కనిపిస్తున్న దృశ్యం

'టీడీపీకి అభివృద్ధి కనిపించదు'

అనంతపురం కార్పొరేషన్: గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రత్యేక చొరవతో రూ.వెయ్యి కోట్లకు పైగా అభివృద్ధి జరిగింది. నగరాభివృద్ధికి మేయర్ వసీం అన్ని చర్యలు తీసుకున్నారు. కళ్ల ముందు కనబడుతున్న అభివృద్ధి చూడలేని టీడీపీ మహిళా నాయకురాళ్లు మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్‌ను విమర్శించడం సరికాదని వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాళ్లు పేర్కొన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 2014 నుంచి 2019 వరకూ అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం నగరాభివృద్ధికి ఏం చేసిందో చెప్పాలన్నారు. అప్పట్లో ఎంపీ, ఎమ్మెల్యే, మేయర్ గ్రూపు రాజకీయాలతో నగరాని భ్రష్టు పట్టించారని ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన రూ.1,045 కోట్ల అభివృద్ధిని మరువద్దని తెలిపారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ సాకే చంద్రలేఖ, హసీనాబేగం, నాయకురాళ్లు కమర్‌తాజ్, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాళ్లు

వంద రోజుల్లో ఏం చేశారు?

వంద రోజుల టీడీపీ పాలనలో నగరాభివృద్ధికి ఏపాటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సభ్యుడు రహంతుల్లా ప్రశ్నించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీంను విమర్శించే హక్కు టీడీపీ నాయకులకు లేదన్నారు. సమావేశంలో నాయకులు సతీష్, రియాజ్, తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలిక అప్పగింత

అనంతపురం: నగరంలో తప్పిపోయిన ఓ బాలికను పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలు.. అనంతపురం మొదటి రోడ్డు శివాలయం సమీపంలో నవీన్, సౌమ్య దంపతులు నివాసం ఉంటున్నారు. సౌమ్య రుద్రంపేటలో పుట్టింటికి వెళ్లగా.. కుమార్తె తన్వి (6 సంవత్సరాలు) శుక్రవారం సాయంత్రం రుద్రంపేటలోని శ్రీ చైతన్య స్కూల్ సమీపంలో ఆడుకుంటూ తప్పిపోయింది. అర్ధగంట అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆ తల్లిదండ్రులు ఆందోళన చెందారు. వెంటనే రుద్రంపేట కూడలిలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్న నాలుగో పట్టణ ఎస్ఐ రాజేంద్ర ప్రసాద్‌కు విషయాన్ని తెలియజేశారు. ప్రాథమికంగా ఆ పరిసరాల్లో పోలీసులు విచారించారు. బాలిక అదే ప్రాంతంలో సైకిల్ తొక్కుతున్న మరొక బాలుడి వెంట వెళ్లినట్లు తేలింది. వెంటనే పోలీసులు బ్లూకోల్ట్స్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. ప్రత్యేక పోలీసు బృందాలను సైతం రంగంలోకి దింపి గాలింపు చర్యలు చేపట్టారు. రుద్రంపేట, రాంనగర్ ప్రాంతాల్లో ఇంటింటినీ జల్లెడ పట్టారు. గంటన్నర తర్వాత ఎట్టకేలకు రుద్రంపేట ప్రాంతంలోని ఓ ఇంట్లో ఉండటాన్ని గమనించి పట్టుకున్నారు. సరదాగా ఆడుకుంటూ వెళ్లిన బాలిక.. ఇంటికి తిరిగి రాలేని స్థితిలో తప్పిపోయినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. చిన్నారని సురక్షితంగా అప్పగించిన అనంతపురం డీఎస్పీ వి.శ్రీనివాస రావు, సీఐలు సాయినాథ్, రాజేంద్రనాథ్ యాదవ్, శ్రీకాంత్, ఎస్ఐ రాంప్రసాద్‌ను ఎస్పీ పి.జగదీష్ అభినందించారు.



బాలికను తల్లికి అప్పగిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ఆట పాటలతో బోధించాలి

రాప్తాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆట పాటలతో బోధించాలని ఐసీడీఎస్ సీడీపీఓ ధనలక్ష్మి అన్నారు. శుక్రవారం ప్రసన్నాయపల్లి పంచాయతీలోని చిన్మయ నగర్-2 అంగన్‌వాడీ కేంద్రంలో సెక్టారు-2 పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. ప్రణాళికబద్ధంగా పూర్వ ప్రాథమిక విద్యను బోధించాలన్నారు. వివిధ రకాల బోధన పద్ధతుల ద్వారా చిన్నారుల్లో మేథోసంపత్తిని పెంపొందించేందుకు అంగన్‌వాడీలు కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా గర్భిణులు, బాలింతల్లో రక్తహీనతను నివారించవచ్చన్నారు. తక్కువ బరువు ఉన్న పిల్లల కోసం తల్లులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం సంక్రమంగా పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమలత, కో-ఆర్డినేటర్ ప్రసాద్‌రావు, ప్రీస్కూల్స్ ప్రథమ్ జిల్లా కో-ఆర్డినేటర్స్ లక్ష్మణ్ మూర్తి, రామ్మోహన్, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ ధనలక్ష్మి

'దేవుడి మాన్యాన్ని పంచిపెట్టారు'

అనంతపురం కల్చరల్: గతంలో మునిసిపల్ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా పని చేసిన ప్రభాకర చౌదరి అవినీతికి తెరలేపి ఇష్టారాజ్యంగా దేవుడి మాన్యాన్ని పంచిపెట్టారని విశ్వహిందూ పరిషత్, హిందూ చైతన్య వేదిక నాయకులు ఘాటుగా విమర్శించారు. శుక్రవారం టవర్‌క్లాక్ వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హిందూ చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు సీఆర్ విశ్వేశ్వర రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు వీరాంజనేయులు, వీహెచ్‌పీ విశ్వనాథరెడ్డి తదితరులు మాట్లాడారు. లక్ష్మీచెన్నకేశవస్వామి మాన్యాన్ని స్వార్థం కోసం అప్పట్లో ప్రజాప్రతినిధిగా ఉన్న ప్రభాకర చౌదరి, ఆయన అనుచరులు సామాన్యులను బలి చేశారన్నారు. రాత్రి సమయాల్లో వారికి పొజిషన్ సర్టిఫికెట్లు జారీ చేసి ఆక్రమణలకు తెరలేపారని తెలిపారు. మళ్లీ ఆలయానికి ఆ మాన్యం చేరే వరకు విశ్రమించేది లేదని స్పష్టం చేశారు. హిందువులకు అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ప్రభుత్వంలో ఉన్నంత మాత్రాన తప్పులు సరిదిద్దుకోమంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రస్తుత ఎమ్మెల్యే వద్దకు వెళ్లి దేవుని మాన్యాన్ని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. కార్యక్రమంలో బీజేపీ, ఇతర హిందూ సంస్థల నాయకులు ఓలేటి రత్నమయ్య, అల్లాడి రామచంద్రయ్య, జగన్‌మోహన్, రామమూర్తి, అశోక్‌రెడ్డి, మందరపు రమణ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

సేవా దృక్పథం అలవర్చుకోండి

అనంతపురం కల్చరల్: మిలాద్-ఉన్-నబీ ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. స్థానిక పాతూరులోని స్వర్ణకారుల వీధిలో సయ్యదా మాసుమా బీబీ సారా బీబీ దర్గా వద్ద కులమతాలకు అతీతంగా మిలాద్ దర్గా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానంలో నాలుగు వేలకు మందికి పైగా ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా అన్నదానాన్ని ప్రారంభించిన ముతవల్లీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఎం షకీల్‌షఫీ మాట్లాడారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గౌసు మొద్దీన్, మైనార్టీ నాయకులు తాజ్ తదితరులతో కలిసి సామూహిక ప్రార్థనలు చేశారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే మిలాద్-ఉన్-నబీ వేడుకలు గత 60 ఏళ్లగా సాగుతూ అనంతకు ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టాయన్నారు. అనంతరం ముఖ్య అతిథులను కమిటీ ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో హాఫిజ్ జబ్బార్, ఇక్బాల్, మాబు, అరిఫ్, బాబా కలేషా, పద్మాకర్ పాల్గొన్నారు.



అన్నదానంలో పాల్గొన్న ముతవల్లీలు, మతపెద్దలు

జామియా మసీదులో ముస్లిం కమిటీ కౌన్సెలింగ్ సెంటర్

అనంతపురం కల్చరల్: రాష్ట్రంలో మొట్ట మొదటిసారిగా ముస్లిం కమిటీ కౌన్సెలింగ్ సెంటర్‌ను నగరంలోని పాతూరు జామీయా మసీదులో ఏర్పాటు చేస్తున్నట్లు ఆల్‌హాజ్ కేఎం షఫీవుల్లా, షకీల్ షఫీ ఓ ప్రకటనలో తెలిపారు. అడ్వకేట్లు, ప్రజా సంఘాల ప్రతినిధులు, ఇమామ్‌లు, ఖాజీలతో ఉన్న కమిటీ ముస్లిం ఫ్యామిలీల, హదీస్ సమస్యలకు పరిష్కారం చూపిస్తారన్నారు. ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 7 గంటల వరకూ, ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కమిటీ వేళలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 9966449993 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

సర్జరీ ప్రొఫెసర్‌కు సన్మానం



సర్జరీ విభాగాధిపతి డాక్టర్ రామస్వామి నాయక్‌ను సన్మానిస్తున్న పీటీసీ డీఎస్పీలు

అనంతపురం మెడికల్: అపెండిసైటీస్‌తో బాధపడుతూ ఆస్పత్రిలో చేరిన ట్రైనీ ఆర్ఎస్ బి.మురళీ నాయక్‌కు సకాలంలో సర్జరీ జరిగేలా చర్యలు తీసుకున్న ప్రొఫెసర్ డాక్టర్ రామస్వామి నాయక్, వైద్యుడు డాక్టర్ మధును పీటీసీ డీఎస్పీలు శ్రీనివాసులు, నీలకంఠేశ్వర రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈనెల 23న ట్రైనీ ఆర్ఎస్ఐ మురళీ నాయక్‌కు కడుపు నొప్పి రావడంతో జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు పరీక్షించి అపెండిసైటీస్‌గా గుర్తించి సకాలంలో సర్జరీ చేశారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు పవన్ కుమార్, వేణుగోపాల్, ఆర్ఎస్ఐ సుందరం తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో సత్తా



జేఎన్‌టీయూ(ఏ)కు అందజేసిన అవార్డుతో ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శన రావు

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురంలో మోస్‌చిప్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఈసీఈ, ఈఈఈ చివరి సంవత్సరం చదువుతున్న ముగ్గురు విద్యార్థులకు ఉద్యోగాలు దక్కాయి. వీరికి రూ.6 లక్షల వార్షిక వేతనం అందిస్తారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జేఎన్‌టీయూ అనంతపురం ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శన రావు అభినందించారు.

జేఎన్‌టీయూకు అవార్డు

మేకింగ్ ఇండియా ఎంప్లాయిబుల్ కాన్ఫరెన్స్ అండ్ అవార్డ్ వారు జేఎన్‌టీయూ(ఏ)కు మేకింగ్ ఇండియా ఎంప్లాయిబుల్ అవార్డు ప్రకటించారు. ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు మాట్లాడుతూ.. అవార్డు రావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

నాట్య పోటీల్లో ప్రతిభ



బహుమతులను చూపుతున్న చిన్నారులు

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన నాట్యాచార్యుడు పట్నం శివప్రసాద్ శిష్యబృందం మరోసారి జాతీయ స్థాయిలో రాణించి బహుమతులను కైవసం చేసుకుంది. ఆల్ ఇండియా మ్యూజిక్ అండ్ డ్యాన్స్ కాంపిటీషన్స్ పేరిట నవ్యనాటక సమితి వారు నిర్వహించిన నాట్య పోటీల్లో శివప్రసాద్ శిష్యులు సీనియర్ విభాగంలో లాలిత్య భామాకలాపం నృత్యరూపకంతో దేవీ చందన, దోహశ్రీ, సోహ, రిషికశ్రీ, జశ్విని తదితరులు వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలచారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగిన పురస్కారాల ప్రదానోత్సవంలో తెలంగాణ సంగీత, నాటక అకాడమీ చైర్మన్ అలేఖ్య పుంజల, కేవీ రమణాచారి, నిర్వాహకులు విజయ్‌కుమార్ తదితరులు కూచిపూడి నాట్య విజేతలను బహుమతులతో సత్కరించారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయశ్రీ

అనంతపురం రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అంగన్‌వాడీ సిబ్బందిపై ఉందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయశ్రీ అన్నారు. శుక్రవారం ఏ.నారాయణపురం పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రం-1లో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే బాలింతలు, గర్భవతులు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలన్నారు. పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది కౌసర్, రమాదేవి, శైలజ, రమా తదితరులు పాల్గొన్నారు.

అనంత పద్మనాభుడికి నృత్య నీరాజనం

అనంతపురం కల్చరల్: ప్రపంచ ప్రసిద్ధి చెందిన తిరువనంతపురం అనంత పద్మనాభస్వామి ఆలయంలో దేశవ్యాప్తంగా ప్రసిద్ధ కళాకారులు తమదైన కళారూపాలను ప్రదర్శించి ఆహూతులను మెప్పిస్తారు. ఆ అరుదైన అవకాశం అనంతకు చెందిన ప్రముఖ నాట్యాచార్యులు సంధ్యామూర్తి శిష్యబృందం దక్కించుకుంది. గురు, శుక్రవారాల్లో ఆట్టుకల్ భగవతి దేవాలయం, అనంత పద్మనాభస్వామి దేవాలయాల్లోని వేదికలపై భరతనాట్యం, కూచిపూడితో అలరించారు. శ్రీనృత్యకళానిలయం చిన్నారులు శ్రద్ధ, దివ్యశ్రీ, కావ్య, లాస్యప్రియ, ఇషిక, మోక్షిత, అశ్విత మహాలక్ష్మి, ఉపాస్య సాయి తదితరులు బృంద నాట్యాలతో కేరళీయులను మెప్పించి అనంత ఖ్యాతిని చాటారు. ఈ సందర్భంగా నాట్య గురువు సంధ్యామూర్తి, శిష్యబృందాన్ని అధికారులు, నాట్య విద్వాంసులు ఘనంగా సత్కరించారు.



సర్టిఫికెట్లు, జ్ఞాపికలందుకున్న సంధ్యామూర్తి శిష్యబృందం

మట్టిపూలు పుస్తకావిష్కరణ రేపు

అనంతపురం కల్చరల్: సీనియర్ రచయిత తూముచర్ల రాజారాం రచించిన 'మట్టి పూలు' విమర్శనా పుస్తకావిష్కరణ సభ అనంతపురంలోని ఉపాధ్యాయ భవన్‌లో ఆదివారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నారు. ఈ మేరకు స్పందన అనంత కవుల వేదిక ప్రధాన కార్యదర్శి చం.శాస్త్రి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

సిట్‌ను రద్దు చేయండి

అనంతపురం టవర్‌క్లాక్: రాష్ట్రంలో సిట్‌ను రద్దు చేయాలని రాజ్యాంగ పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు పోతుల నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాని డిమాండ్ చేశారు. గత పది సంవత్సరాలుగా రాష్ట్రంలో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ జరపాలని కోరారు. రాజకీయ కక్షసాధింపులో పోలీస్ వ్యవస్థను బలి చేస్తున్నారన్నారు. దీంతో దళిత అధికారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

సంగం శ్రీనివాసులు సేవలు అమూల్యం



నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులును సన్మానిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో గత కొన్నేళ్లుగా కార్యదర్శిగా సేవలందించిన సంగం శ్రీనివాసులు సేవలు మరువలేనివని మేయర్ వసీం పేర్కొన్నారు. ఇటీవల సంగం శ్రీనివాసులు హిందూపురం కమిషనర్‌గా బదిలీ అయిన విషయం విదితమే. శుక్రవారం నగరపాలక సంస్థలోని కౌన్సిల్ హాల్‌లో ఆయనకు వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో సంగం శ్రీనివాసులు అంకితభావంతో పని చేసి ప్రజారోగ్యానికి ప్రత్యేక చర్యలు తీసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. కష్టపడి పని చేసే వారికి గుర్తింపు ఉంటుందనడానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, డిప్యూటీ కమిషనర్లు వెంకటేశ్వర్లు, ఏసీపీ మారుతీ హరిప్రసాద్, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, సైఫుల్లాబేగ్ పాల్గొన్నారు.

అదనపు కమిషనర్‌గా రామలింగేశ్వర్



కమిషనర్ నాగరాజు వద్ద రిపోర్టు చేసుకుంటున్న అదనపు కమిషనర్ రామలింగేశ్వర్

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా రామలింగేశ్వర శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. అందుకు ముందు ఆయన నగరపాలక సంస్థలో మేయర్ వసీం, నగరపాలక సంస్థ కమిషనర్ నాగరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల కర్నూలు నుంచి ఆయన బదిలీపై అనంతపురానికి వచ్చారు.

బాధ్యతలు స్వీకరించిన సబ్ రిజిస్ట్రార్లు

అనంతపురం టౌన్: అనంతపురం రూరల్ సబ్ రిజిస్ట్రార్‌గా శ్రీరాములు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. నంద్యాల జిల్లా కోవెలకుంట్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎస్ఆర్‌గా పని చేస్తున్న ఈయన్ను రూరల్ కార్యాలయానికి బదిలీ చేశారు. అనంతపురం రామ్‌నగర్ కార్యాలయంలో జాయింట్ సబ్ రిజిస్ట్రార్-2గా యూనస్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇన్‌చార్జ్‌గా పని చేస్తున్న ఇస్మాయిల్‌కు సీనియర్ అసిస్టెంట్‌గా పోస్టింగ్ ఇచ్చారు. డీఐజీ విజయలక్ష్మి, జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్‌ను ఈ సందర్భంగా నూతన సబ్ రిజిస్ట్రార్లు మర్యాదపూర్వకంగా కలిసి బాధ్యతలు తీసుకున్నారు.

యువ మోర్చా నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ల నియామకం

అనంతపురం టవర్‌క్లాక్: జిల్లాలో బీజేపీ సభ్యత్వ నమోదుకు ఇన్‌చార్జ్‌లను నియమిస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురం నియోజకవర్గానికి మంజుల వెంకటేష్, రాయదుర్గానికి అజేష్ యాదవ్, ఉరవకొండకు హ రిష్ రెడ్డి, కళ్యాణదుర్గానికి గొనుకుట్ల రాజేష్, శింగనమలకు గంగా రాజేష్, తాడిపత్రికి సాయినాథ్ రెడ్డిని నియమించడం జరిగిందన్నారు.

ఎస్పీ జగదీష్‌కు శుభాకాంక్షలు



ఎస్పీ జగదీష్‌కు పూలమొక్క అందజేస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ విన్నూత్న

అనంతపురం సెంట్రల్: జిల్లా ఎస్పీ జగదీష్‌ను శుక్రవారం ఆయన చాంబర్‌లో అసిస్టెంట్ కలెక్టర్ విన్నూత్న మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి శుక్రవారం జిల్లా ఎస్పీ పి.జగదీష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు ఉచిత టీకాలు

అనంతపురం అగ్రికల్చర్: ప్రపంచ రేబీస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 28న పెంపుడు జంతువులకు ఉచిత టీకాలను వేయనున్నట్లు పశుసంవర్ధకశాఖ ఉభయ జిల్లాల జేడీలు డాక్టర్ జీపీ వెంకటస్వామి, డాక్టర్ జి.శుభదాస్, పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ డాక్టర్ ఎన్.రామచంద్ర తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ... ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 35 వేల డోసుల మందు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

ఈ-క్రాప్‌తో రైతులకు లబ్ధి

కనగానపల్లి: ఈ-క్రాప్ ద్వారా పంటల వివరాలను నమోదు చేయించుకుంటేనే రైతులకు వ్యవసాయ రాయితీలు అందుతాయని ధర్మవరం ఏడీఏ క్రిష్ణయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని ముక్తాపురం రైతు సేవా కేంద్రాన్ని సందర్శించారు. ఖరీఫ్ పంటల నమోదుకు చేస్తున్న ఈ-కేవైసీని పరిశీలించారు. మండలంలో ఖరీఫ్ పంటల నమోదును దాదాపు పూర్తి చేశామని తెలిపారు.